క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

⇨ **మనుబోలు :** మనుబోలు, జట్లకొండూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో గురువారం విశేష పూజలు జరిపించారు. అర్చకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ సాయినాథుని విగ్రహాలకు పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

రావి ఆకుపై శంకరాచార్యులు



పొదలకూరు : శంకరాచార్యుల జయంతి సందర్భంగా రావిఆకుపై ఆయన చిత్రాన్ని పొదలకూరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య గీశారు. నేడు శంకరాచార్యుల జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



కోవూరు : మండలంలోని ఇనమడుగు గ్రామంలో సత్యానంద ఆశ్రమంలో నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా హోమియో వైద్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. డాక్టర్ వి.కరుణాకర్ వంద మంది రోగులను పరీక్షించి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సుచించారు. మూడు రోజుల పాటు శిబిరం కొనసాగుతుందన్నారు.

అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ శిబిరం

వెంకటాచలం : పదో ఆంధ్రా నావల్ యూనిట్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ ఆధ్వర్యంలో మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ మూడో వార్షిక శిక్షణా శిబిరం నాలుగో రోజు గురువారం కొనసాగింది. ఇందులో డ్రిల్, గన్ ఫైరింగ్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కోవూరు : మండలంలోని పడుగుపాడు మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పడుగుపాడు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని కోవూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఆర్డీఎస్ఎస్ పనులు దృష్ట్యా లేగుంటపాడు, సీతారామపురం ప్రాంతాల్లో సైతం విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అసత్య ఆరోపణలు తగవు

కోవూరు : దిశ ఫౌండేషన్ కార్యదర్శిగా పనిచేసిన నిడిగుంట అరుణపై అసత్య ఆరోపణలు తగవని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య అన్నారు. మండల కేంద్రంలోని కోవూరులో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆమె ఎదుగుదలను ఓర్వలేక పేటేటి రాజారావు, మరికొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దళిత నాయకుడు కె.ప్రభుదాస్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్, ఉద్యోగ సంఘం నాయకులు దమ్ము రాజశేఖర్, మదన్, మురళి, రాఘవులు పాల్గొన్నారు.

జాడలేని ప్రగతి.. సంక్షేమం అధోగతి

- కోవూరు నియోజకవర్గంలో కుంటుపడిన అభివృద్ధి, సంక్షేమం
- కొత్తగా ఓ పింఛన్ లేదు, రోడ్డు నిర్మాణం అనలే లేదు
- కీలక పనులకూ మోక్షం కరువు
- ఎమ్మెల్యే హామీలు నీటిమూటలు

అధికారంలోకి వస్తే అవినీతిరహిత పాలన అందిస్తాం.. రోడ్ల నిర్మాణం చేపడుతాం.. కొత్త పింఛన్లు మంజూరు చేస్తాం.. ఇలా అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గతంలో పలు సమావేశాల్లో హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా కోవూరు నియోజకవర్గంలో ఒక రోడ్డు నిర్మాణం చేపట్టింది లేదు. కొత్త రేషన్ కార్డుల ఊసేలేదు. పింఛన్ల కోసం దరఖాస్తులు వేలల్లో ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– బుచ్చిరెడ్డిపాళెం రూరల్



పునాదుల దశలోనే నగర పంచాయతీ కార్యాలయం

గత ప్రభుత్వంలో ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలకు అర్హులైతే చాలు వారిని వలంటీర్లు గుర్తించి గ్రామంలోని సచివాలయానికి తీసుకెళ్లి నేరుగా దరఖాస్తు సమర్పించే వీలుండేది. నిర్ణీత గడువులోగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవి. ఎవరి సిఫార్సులు అవసరం ఉండేది కాదు. ప్రతినెలా రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు ఎవరి ప్రమేయం లేకుండా జరిగిపోయేవి. ప్రస్తుత పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

అభివృద్ధి ఎక్కడ

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కోవూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో నిర్మించ తలపెట్టిన నగర పంచాయతీ కార్యాలయ నిర్మాణం పునాదుల దశ దాటలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే దీని నిర్మాణానికి కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయి. పనులు కూడా మొదలుపెట్టారు. ఈలోపు ఎన్నికలు రావడంతో పనులు ఆగాయి. అనంతరం కోవూరు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రశాంతిరెడ్డి అదే భవనానికి మళ్లీ శంకుస్థాపన చేశారు. త్వరితగతిన నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అయితే ఇప్పటివరకు నిర్మాణం పూర్తి కాలేదు. పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. చెన్నూరురోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. నగర పంచాయతీ పరిధిలో అనేక వార్డుల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. నగర పంచాయతీ అధికారులు, కూటమి నాయకులు కూడా దీని గురించి పట్టించుకోవడం లేదు. చిరు వర్షానికే రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి.

నత్తనడకన అమృత్ 2.0

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నగర పంచాయతీకి తాగునీరు అందించేందుకు అమృత్ 2.0లో భాగంగా ఎస్ఎస్సార్ తాగునీటి పథకానికి రూ.85 కోట్లతో శ్రీకారం చుట్టారు. దీనిద్వారా సంగం మండలం నుంచి పైపులైన్లు ఏర్పాటు చేసి పట్టణంలోని పది వేల ఇళ్లకు నీరు ఇవ్వాలన్నది లక్ష్యం. ప్రస్తుతం ఈ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. కాగా నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏ మండలానికెళ్లినా పింఛన్లు, ఇళ్ల స్థలాల కోసం వందల్లో దరఖాస్తులు అందుతున్నాయి. అయితే వాటికి పరిష్కారం మాత్రం దొరకడం లేదు. బుచ్చిరెడ్డిపాళెం రూరల్, పట్టణంలో కలిపి కొత్తగా వివిధ పింఛన్లకు దరఖాస్తు చేసినవారు దాదాపు 500 మంది ఉన్నారు. మిగతా మండలాలు కోవూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేటలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. పింఛన్లు, ఇళ్లు ఎప్పుడు మంజూరు చేస్తారని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అయితే ఆమె వాటిని దాటవేస్తున్నారు.

ప్రధాన హామీల ఊసేదీ!

అధికారంలోకి రాగానే కోవూరు చక్కెర కర్మాగార కార్మికుల బకాయిలు, సమస్యలు పరిష్కరిస్తామని గతంలో బుచ్చిరెడ్డిపాళెం ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హామీ ఇచ్చారు. ప్రస్తుతం చక్కెర కర్మాగార కార్మికులు తమ బకాయిలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని రోడ్కెక్కే పరిస్థితి ఏర్పడింది. అలాగే చెరకుకు మద్దతు ధర కూడా కల్పించాలని రైతులు అడుగుతున్నారు. కొడవలూరు రాచర్లపాడులో ఇఫ్కో, విడవలూరు మండలంలోని ముదివర్తి, ఇందుకూరుపేటలోని ముదివర్తిపాళెం వరకు పెన్నానదిలో నిర్మించనున్న కాజ్‌వే పనులూ మొదలు కాలేదు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కాజ్‌వే నిర్మాణానికి ఉన్న అన్ని అడ్డంకులు తొలగించి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఆ పనులు జరగడం లేదు. ప్రశాంతిరెడ్డి జోక్యం చేసుకుని వీటిని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రాళ్లు తేలి అధ్వానంగా తయారైన చెన్నూరు రోడ్డు



నత్తనడకన ఎస్ఎస్సార్ తాగునీటి పథకం పనులు

విద్యతోనే వికాసం

మనుబోలు : విద్య ద్వారానే బాలికల వికాసం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కిశోర వికాసం పేరుతో బాలికలకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు క్రమశిక్షణతో మెలుగుతూ బాగా చదువుకుని స్వశక్తితో నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జలజాక్షి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేయ పూజిత, ఎంఈఓ రమేష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సమస్యలపై అవగాహన కల్పించాలి

వెంకటాచలం: కిశోర వికాసం కార్యక్రమం ద్వారా బాలికలు, యుక్త వయస్సు మహిళలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కల్పన సూచించారు. వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసం కార్యక్రమంపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలికలను గ్రామాల్లో సమావేశ పరిచి విద్యా ప్రాముఖ్యత, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహార పదార్థాలు తీసుకోవాల్సిన ఆవశ్యకత తదితర అంశాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఐసీడీఎస్, పీహెచ్‌సీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

తోటపల్లిగూడూరు : బాల, బాలికల ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ తీసుకోవాలని కోడూరు ఆరోగ్య కేంద్రం హెల్త్ హెడ్యుకేటర్ ఉమర్ అహ్మద్ సూచించారు. మండల వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాశంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఉమర్ అహ్మద్ మాట్లాడుతూ విశోర వికాశం కార్యక్రమంలో భాగంగా బాల బాలికలకు వారి చట్టాలు, వ్యక్తిగత పరిశుభ్రతలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై తగిన జాగ్రత్తలను వివరిస్తామన్నారు. ఈనెల 2 నుంచి 10వ తేదీ వరకు అవగాహన సదస్సులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రంగమ్మ, విజయలక్ష్మి, ఎంపీహెచ్ఏ జీవకుమారి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



మనుబోలు : మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి



వెంకటాచలం: మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్పన



ఇందుకూరుపేటలో..

అవగాహన కల్పించాలి

ఇందుకూరుపేట : పోక్సో చట్టం, బాలల హక్కులు, లింగ వివక్షత తదితర అంశాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని సీడీపీఓ రాజ్యలక్ష్మి కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలకు ప్రతి మంగళ, శుక్రవారం శిక్షణా తరగతులు ఉంటా యన్నారు. ఏపీఎం సరిత, ఈఓపీఆర్డీ శ్యామ్, జగదేవి పేట హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, ఐసీడీఎస్ సూ పర్‌వైజర్లు సుబ్బరత్న, మంజుల, శిరీష పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలతో మానసికోల్లాసం

మనుబోలు : వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని మనుబోలు లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ అన్నారు. మనుబోలు గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు చెస్, క్యారమ్స్, క్విజ్ పోటీలు నిర్వహించారు. పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించి విద్యార్థులతో బొమ్మలు చేయించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికితీసేలా వివిధ రకాల కార్యక్రమాలను రూపొందించామన్నారు.

⇨ **విడవలూరు(కొడవలూరు) :** కలర్ పేపర్స్‌తో క్రాఫ్ట్ చేయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని లైబ్రేరియన్ కె.రాజేశ్వరి సూచించారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో రంగుల పేపర్లతో గురువారం బొమ్మలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో అనేక రకాల నైపుణ్యాలుంటాయని, సాధన చేయించడం ద్వారా వాటిని వెలుగులోకి తేవచ్చన్నారు. అనంతరం మేడే ప్రాముఖ్యతను వివరించారు.



మనుబోలు : చెస్ ఆడుతున్న చిన్నారులు



కొడవలూరు గ్రంథాలయంలో..

శ్మశాన నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం

విడవలూరు(కొడవలూరు) : కొడవలూరు మండలంలోని గుండాలమ్మపాళెంలో శ్మశానం నిర్మాణానికి వీపీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.25 లక్షల విరాళమిస్తున్నట్లు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రకటించారు. గుండాలమ్మపాళెంలో సామాజిక పింఛన్‌లను గురువారం పంపిణీ చేసిన ఆమె అనంతరం రూ.5 లక్షలతో వేసిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులకు శ్మశాన సదుపాయం లేదని విన్నవించుకున్న నేపథ్యంలో ట్రస్ట్ ద్వారా విరాళమిస్తున్నట్లు తెలియజేశారు. తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, సర్పంచ్ దివ్యారెడ్డి, స్థానిక నాయకులు శేఖర్‌రెడ్డి, పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, అమరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

⇨ **తోటపల్లిగూడూరు :** మండలంలోని విలుకానుపల్లి గిరిజన కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, నాయకులు ముత్యాల శ్రీనివాసులు, గోపిరెడ్డి వెంకటేశ్వర్ల యాదవ్, శివయ్య నాయుడు, చేవూరు శ్రీనివాసులు, నెల్లిపూడి సుధాకర్ పాల్గొన్నారు.



పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా మేడే



పొదలకూరు పట్టణంలో ర్యాలీ



కోవూరు : మాట్లాడుతున్న జక్కా శేషమ్మ

పొదలకూరు : మేడే వేడుకలను పట్టణంలో సీఐటీయూ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో సీనియర్ నాయకుడు బి.వెంకటేశ్వర్లు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గేటు సెంటర్ వరకు అక్కడి నుంచి తిరిగి పంచాయతీ బస్టాండ్, పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి ప్రయాణికులకు అందజేశారు. బస్టాండ్ సెంటర్‌లో ఆటో స్టాండ్ వద్ద కూడా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల బాధ్యుడు అల్లాడి, సీఐటీయూ బాధ్యుడు బోలా మనోహర్, నాయకుడు గుడి మణి, వెంకటేశ్వర్లు, హమాలీలు, ఆటో రిక్ష కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్యకర్తలు పాల్గొన్నారు.

⇨ **తోటపల్లిగూడూరు :** మండలంలోని నరుకూరు సెంటర్, కామాక్షినగర్, పేడూరు, కృష్ణారెడ్డిపాళెం, తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం, సాలిపేట తదితర గ్రామాల్లో మేడే వేడుకలను వామపక్ష నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ క్రమంలో ఇస్కపాళెం సెంటర్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తాగునీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా, సీపీఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, నేతలు వేగూరు శంకరయ్య, అన్నం పుట్టయ్య, వెంకట శేషయ్య, మోచర్ల రాధయ్య, కాల్తిరెడ్డి రమణమ్మ పాల్గొన్నారు.

⇨ **మనుబోలు :** హక్కుల కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని ఆటో యూనియన్ మండల గౌరవాధ్యక్షుడు అల్లూరు రమేష్ అన్నారు. మేడేను మండల కేంద్రంతో పాటు అక్కంపేట, మడమనూరు, వీరంపల్లి, బండేపల్లి గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆటో స్టాండ్ వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వామపక్ష, ఆటో యూనియన్ కార్యకర్తలు మనుబోలు వైఎస్సార్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. వామపక్ష నాయకులు యాదగిరి, దేవదానం, ఆదిశేషయ్య, శివరామకృష్ణ, చంద్రశేఖర్, చాంద్‌బాషా, దినేష్, వెంకటేశ్వర్లు, చెంచురామయ్య పాల్గొన్నారు.

⇨ **ఇందుకూరుపేట:** మండలంలోని ఇందుకూరుపేట, నరసాపురం, మైపాడు, జగదేవిపేట గ్రామాల్లో మేడేను ఘనంగా నిర్వహించారు.

⇨ **కోవూరు :** కోవూరులోని మందబయలు సెంటర్, మైథిలి సెంటర్, పెళ్లకూరు కాలనీ, బజార్ సెంటర్, పడుగుపాడు, గుమ్మలదిబ్బ, పోతిరెడ్డిపాళెం, గంగవరం, పాటూరు, పాటూరి పల్లిపాళెం తదితర గ్రామాల్లో మేడే వేడుకలు జరిగాయి. తొలుత మందబయలు సెంటర్లో జెండా ఆవిష్కరణ జరిగింది. సీపీఎం నేతలు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డిల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి జక్కా శేషమ్మ నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మన్నూరు, జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య, సుబ్బారావు, హరి, బాబు, సురేష్, విజయ్, అఫ్రోజ్, రమేష్, సర్దార్, చాంద్‌బాషా, పెద్దబ్బయ్య పాల్గొన్నారు.

⇨ **విడవలూరు(కొడవలూరు) :** కార్మిక హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ స్పష్టం చేశారు. మేడేను పురస్కరించుకుని మండలంలోని నార్తురాజుపాళెంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కార్మికులు కష్టపడి సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. సీఐటీయూ నాయకులు తలారి నరసింహం, దేవానంద్, కాంతారావు, మాబాషా పాల్గొన్నారు.

అధ్వానంగా వాటర్ ట్యాంక్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ బీసీ కాలనీలో తాగునీటి వాటర్ ట్యాంక్ అధ్వానంగా ఉంది. పాచిపట్టి నీరు వృథాగా పోతోంది. ప్రస్తుత వేసవి కాలంలో కొన్ని ప్రాంతాల్లో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ఇక్కడ మాత్రం నీరు వృథాగా పోతోంది. తాగునీటి పథకం, అధికారులుగానీ, పంచాయతీ సిబ్బందిగానీ దీనివైపు చూసిన దాఖలాలు లేవు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పాచిపట్టి ఉన్న తాగునీటి ట్యాంక్

హెచ్చరిక బోర్డు తొలగింపుపై కేసు నమోదు

పొదలకూరు : పట్టణంలోని సత్యనారాయణ లేఅవుట్‌లో పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించారని పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు ఎం.శివశంకర్‌పై కేసు నమోదు చేశారు. సత్యనారాయణ లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం 286 అంకణాల స్థలాన్ని అప్పట్లో కేటాయించారు. అయితే కొందరు ఆ స్థలాన్ని విక్రయించారు. దీంతో పంచాయతీ అధికారులు స్పందించి స్థలంలో ఇతరులు ప్రవేశించకూడదని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. దీనికితోడు న్యాయస్థానంలో కేసు నడుస్తున్న స్థలంలో బోర్డును తొలగించడంపై సెక్రటరీ ఫిర్యాదు చేయడంతో ఎస్సై హనీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుచ్చి నగర కమిటీ నియామకం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ కమిటీని పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు నగర ప్రెసిడెంట్‌గా షాహుల్, వైస్ ప్రెసిడెంట్లుగా ఆదిశేషయ్య, కోటయ్య, జనరల్ సెక్రటరీలుగా వెంకటరమణయ్య, సుల్తాన్, శ్రావణ్ నియమితులయ్యారు. సెక్రటరీలుగా శీనయ్య, మాల్యాద్రియాదవ్, మహేష్, హజరత్తయ్య, అనిల్, ట్రెజరర్‌గా సద్దాం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సర్దార్, బాదుల్లా, రమణయ్య, లక్ష్మయ్య, శీనయ్య, సుబ్బారావు, నరేష్, సమీర్, రబ్బు, సుబాన్‌బాషా, వెంకటరమణయ్య, ప్రసాద్, రవి చంద్రారెడ్డి, కవిత, లక్ష్మిని నియమించారు.

జేఎస్ రెడ్డికి నివాళి



మనుబోలు : నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్ దివంగత జక్కా శ్రీనివాసులురెడ్డి (జేఎస్ రెడ్డి) సంస్మరణ సభను మనుబోలులోని జేఎస్‌రెడ్డి గార్డెన్స్‌లో గురువారం నిర్వహించారు. మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డితో పాటు జేఎస్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు.

క్రైమ్ కార్నర్

కారును ఢీకొన్న లారీ

- ఒకరికి తీవ్రగాయాలు



దెబ్బతిన్న కారు

మనుబోలు : కారును వెనుక నుంచి లారీ ఢీకొన్న ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద గురువారం జరిగింది. చెన్నైకి చెందిన డేగా దయాకర్‌రెడ్డి కోర్టు పనుల నిమిత్తం నెల్లూరుకు వస్తున్నారు. బద్దెవోలు క్రాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ అదుపుతప్పి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో దయాకర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కారు ఢీ.. బైక్ నుజ్జునుజ్జు

ఇందుకూరుపేట : మండలంలోని రావూరు గ్రామంలో కారు ఢీకొనడంతో బైక్ నుజ్జునుజ్జయింది. స్థానికుల కథనం మేరకు.. అనంతపురం నుంచి కారులో కొందరు గురువారం మైపాడు బీచ్‌కు వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో రావూరు సమీపాన కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపిన బైక్‌ను ఢీకొంది. ఈ వేగానికి పక్కనే ఉన్న మరో కారును కూడా ఢీకొని బైక్ నుజ్జునుజ్జు అయింది. నిలిచి ఉన్న మరో కారు సైతం కొంత దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.



కారు కింద పడి ఉన్న బైక్

కారు, ఆటో ఢీ

- ఐదుగురికి గాయాలు

ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురంలో గురువారం రాత్రి కారు– ఆటో ఢీకొని ఐదుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. మైపాడు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు నరసాపురం గమళ్లపాళెం వద్దకు చేరుకునే సరికి ఎదురుగా కూలీలతో వస్తున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు.